క్లుప్తంగా

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రెబ్బెన: ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు సునీత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి



ఎఫ్‌ఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన ధారావత్ ధన్‌రాజ్ పత్తి చేనులో మంగళవారం రాత్రి అడవి పందులు బీభత్సం సృష్టించాయని, రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎఫ్‌ఆర్‌వో కార్యాలయంలో ఎఫ్‌ఆర్‌వో మజారోద్దిన్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు పిరాజీ, సురేశ్, ఉదారాం, సంతోష్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత



బొలెరో వాహనంలో పశువులు

జైనూర్: కెరమెరి నుంచి జైనూర్‌కు వెళ్తున్న బొలెరో వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్సై బాబార్‌హేగ్ బుధవారం మండలంలోని కాలేజిగూడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత



కారులో తరలిస్తున్న గుట్కా ప్యాకెట్‌లు

జైనూర్: ఉట్నూర్ నుంచి జైనూర్ వైపునకు ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. శివనూర్ కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఉట్నూర్ నుంచి జైనూర్‌కు వస్తున్న కారును తనిఖీ చేయగా గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

పుస్తకాలు బాగా చదవాలి



లైబ్రరీ ప్రారంభిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని పుస్తకాలను బాగా చదవాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని కర్జెల్లీలోని ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఎంఈవో జయరాజు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, భీంరావు, కోఆర్డినేటర్ వెంకన్న, సీఆర్పీ శివరాం, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి'

ఆసిఫాబాద్: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించే దిశగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయం' గతి మారేదెన్నడో?

- పంచాయతీ భవనంలో గ్రంథాలయం
- సదుపాయాలు కరువు
- పట్టించుకోని పాలకులు



కౌటాల గ్రామపంచాయతీ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

కౌటాల: గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. కోట్లు కేటాయిస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తుండటంతో నిరుద్యోగులు గ్రంథాలయాల బాట పడుతున్నారు. జిల్లా కేంద్రం మినహా ఎక్కడా కూడా కనీసం పక్కా భవనాలు కూడా లేవంటే లైబ్రరీల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వేళ గ్రంథాలయాల్లోని సమస్యలు పరిష్కరించాలని పలువురు పేర్కొంటున్నారు. టెట్, డీఎస్సీ, ఆర్‌ఆర్‌బీ, సీటెట్, ఇతర పోటీ పరీక్షలకు నిరుద్యోగులు ప్రిపేర్ అవుతున్నారు. కానీ గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

పుస్తకాల్లేని గ్రంథాలయం..

అజ్ఞానమనే చీకటిని పారదోలి వెలుగులు ప్రసాదించేవి పుస్తకాలు. వాటిని అందరికి అందుబాటులో ఉంచి సమాజానికి ఉపయోగపడేవి గ్రంథాలయాలు. విద్యార్థులు, యువత, పెద్దలు వాటిని సద్వినియోగం చేసుకునేందుకు వాటితో కలిగే ఉపయోగాలను వివరించేందుకు ప్రస్తుతం జిల్లాలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కానీ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని అభివృద్ధి పర్చడంలో సంబంధిత శాఖ అధికారులు శ్రద్ధ తీసుకోవడంలేదు. పోటీ పరీక్షల నేపథ్యంలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగ యువతకు గ్రంథాలయంలో కుర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు సైతం లేవు. కేవలం రెండు, మూడు దినపత్రికలు అందుబాటులో ఉంటున్నాయి. దీంతో లైబ్రరీకి వెళ్తున్న నిరుద్యోగులు, పాఠకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు లేకపోవడంతో చాలా మంది లైబ్రరీ వైపు కన్నెత్తి చూడడం లేదు.

జాడలేని వారోత్సవాలు..

నాలుగు పత్రికలు, విరిగిన కుర్చీలు, తిరగని ఫ్యాన్లు.. ఇదీ కౌటాల గ్రంథాలయంలో నెలకొన్న పరిస్థితి. గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు సైతం కరువయ్యాయి. పాఠకులు కుర్చోవడానికి సరిపడా కుర్చీలు లేవు. గ్రంథాలయానికి ఎక్కువ మంది పాఠకులు వస్తే వారందరు నిలబడాల్సిందే. ఉన్న రెండు, మూడు కుర్చీలు సైతం విరిగిపోయే స్థితిలో ఉన్నాయి. పుస్తకాలతో పాటు మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడ్సాలి వస్తుంది. గ్రంథాలయానికి దాతలు పుస్తకాల వితరణకు సుముఖంగా ఉన్నప్పటికీ.. వాటిని తీసుకుని భద్రపరిచేందుకు అనువైన స్థలం లేకపోవడం గమనార్హం. జిల్లాలో పలు చోట్ల గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నా.. కౌటాల గ్రంథాలయం పరిధిలో మాత్రం ఇప్పటి వరకు వారోత్సవాలు నిర్వహించలేదు. ప్రస్తుతం ఈ గ్రంథాలయానికి లైబ్రేరియన్ కూడా లేకపోవడంతో వాచ్‌మెన్ ప్రతిరోజు కార్యాలయాన్ని తెరుస్తున్నాడు. గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించడంతో పాటు లైబ్రేరియన్‌ను నియమించాలని నిరుద్యోగులు, పాఠకులు కోరుతున్నారు.

జిల్లాలో 11 గ్రంథాలయాలు..

జిల్లాలో మొత్తం 15 మండలాలు ఉండగా.. 11 మండలాల్లో గ్రంథాలయాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన చింతలమానెపల్లి, లింగాపూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో లైబ్రరీలు లేవు. కౌటాల గ్రంథాలయం గత 30 ఏళ్లుగా కౌటాల గ్రామ పంచాయతీ చిన్న భవనంలో కొనసాగుతోంది. ప్రస్తుత భవనంలో ఏటా వర్షాకాలంలో భవనం పైకప్పు నుంచి వర్షం నీరు ఉరుస్తుంది. దీంతో గ్రంథాలయంలోని పుస్తకాలు, దినపత్రికలు తడిసిపోతున్నాయి. గతంలో గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మిస్తామని హడావుడి చేసిన పాలకులు తర్వాత పట్టించుకోవడం లేదు.

భవనం నిర్మించాలి..



కౌటాల శాఖ గ్రంథాలయానికి సొంత భవనం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుత భవనం పైకప్పు శిథిలావస్థలో ఉంది. ఏటా వర్షాకాలంలో పుస్తకాలు, దినపత్రికలు తడిసిపోతున్నాయి. ఒకే గదితో ఇరుకుగా ఉండి గాలి, వెలుతురు సక్రమంగా రావడం లేదు. అధికారులు స్పందించి కౌటాల లైబ్రరీకి సొంత భవనం నిర్మించాలి.

– నాగరాజు, నిరుద్యోగి, కౌటాల

ధరణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ధరణిపోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి ధరణి ధ్రువపత్రాలు, కల్యాణలక్ష్మిపై తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిపోర్టల్‌లో విరాసత్, భూ విస్తీర్ణం సవరణ, పేరు సవరణ, నిషేధిత జాబితాలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యాలయ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోర్టు కేసులు ఉన్న వాటిపై రికార్డులను పూర్తిగా పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



పెంచికల్‌పేట్: చెక్కు అందజేస్తున్న హరీశ్‌బాబు



దహెగాంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి రైతు వేదికలో లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీశ్ బాబు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 34 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏవో మనీషా, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రాజన్న, పార్టీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్ తదితరులు ఉన్నారు.

దహెగాంలో..

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎలాంటి అవినీతికి అస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 76 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తిర్యాణి: కుమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని రొంపెల్లి గ్రామంలో భీం విగ్రహావిష్కరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహం వద్ద సంప్రదాయంగా పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. విద్య ద్వారానే ఆదివాసీల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గోండ్వాన పార్టీ అధ్యక్షుడు అర్జు మాస్టర్, కుమురం భీం మనువడు సోనేరావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కంకలమ్మ జాతరకు ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

కౌటాల: మండల కేంద్రం సమీపంలోని గట్టుపై గల స్వయంభూ శ్రీ కేతేశ్వర –కంకలమ్మ దేవి ఆలయ 20వ మహాజాతరకు రావాలని కాగజ్‌నగర్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆహ్వాన పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1, 2వ తేదీల్లో మండల కేంద్రం సమీపంలోని గుట్టపై గల దేవాలయంలో జాతర ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు ఎల్ములే మల్లయ్య, దుర్గం మోతిరాం, పెదపల్లి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వండిన పప్పును పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో లక్ష్మినారాయణ

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మినారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. వంట గదిని పరిశీలించారు. వంట పాత్రలు శుభ్రంగా కడగాలని, మెనూ పాటించాలన్నారు. అనంతరం స్టోర్ రూంలోని పప్పుధాన్యాలు, బియ్యం, ఇతర సరుకులు పరిశీలించారు. రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ధనోరాలోని ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో అంజద్‌పాషా, గ్రామ కార్యదర్శి అంబారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఆర్‌డీవో లోకేశ్వర్ రావు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ప్రయోజకులు కావాలని ఆర్‌డీవో లోకేశ్వర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలిచేందుకు ఆంగ్ల భాషా నైపుణ్యాలు అవసరమన్నారు. ఆధునిక కాలంలో అన్ని రంగాల్లో రాణించాలంటే ఆంగ్ల భాషా నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాజా నిజాముద్దీన్, మాజీ స్కూల్ చైర్మన్ అబ్దుల్ హన్నాన్, మొహమ్మద్ అశ్రఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణతో విద్యార్థినులకు ఆత్మరక్షణ



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

రెబ్బెన: కరాటే శిక్షణ విద్యార్థినులకు ఆపద సమయంలో ఆత్మరక్షణగా నిలుస్తుందని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నవేగాం పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి వరకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఈనెల 12 నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుండే బాలికలు కరాటే శిక్షణపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ చాపిడి కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మైనింగ్ టెక్నికల్ స్టాఫ్ అలవెన్సులు సరిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న మైనింగ్, టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల అలవెన్సులను సరిచేసి చెల్లించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పని చేసే టెక్నికల్ ఏ గ్రేడ్ మైనింగ్ సిబ్బందితో పాటు ఇతర డిపార్టుమెంట్లలో పని చేస్తున్న సూపర్‌వైజర్లకు చెల్లించే ట్రాన్స్‌పోర్టు అలవెన్సు, బంగ్లా అప్‌కీప్ అలవెన్సు, చార్జీ అలవెన్సులను వెంటనే పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ నాయకులు మంతు సమ్మయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న భుజంగ్‌రావు

కెరమెరి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలను ఏ ప్రభుత్వం కూడా నెరవర్చడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమకారులైన టీపీటీఎఫ్ బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సీఆర్టీల సమస్యలు పరిష్కరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెల వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా బాధ్యులు చౌహాన్ నారాయణ, కనక వెంకటేశ్వర్, కర్ను, శ్యాంరావు, అర్జున్, నైతం నారాయణ, సుందర్, కమలా, సంతోష్, గంగాసాగర్, భగవంత్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నగదు అందజేస్తున్న నీరజ్‌కుమార్ టిబ్రివాల్

జైనూర్: పులి సంచారంతో పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎఫ్‌డీవో నీరజ్‌కుమార్ టిబ్రివాల్ అన్నారు. బుధవారం మండలంలోని భూసిమెట్ట క్యాంపు ప్రజలతో సమావేశమై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు భయభ్రాంతులకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతన్నలు ఉదయాన్నే పత్తితీతకు వెళ్లడం, ఒంటరిగా వెళ్లడం చేయకూడదన్నారు. ఉదయం 9, 10 గంటల ప్రాంతంలో గుంపులుగా వెళ్లి వ్యవసాయ పనులు చేపట్టాలన్నారు. తీసిన పత్తిని సాయంత్రం 5 గంటల లోపే జమచేసుకొని గ్రామాలకు చేరుకోవాలన్నారు. ఎఫ్‌ఆర్‌వోలు మజ్రోద్దిన్, ఔసేశ్వర్, గ్రామస్తులు ఉన్నారు.

'ఆదివాసీలకు రిజర్వేషన్లు కొనసాగించాలి'

ఎదులాపురం: ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్‌గా ఆదివాసీల రిజర్వేషన్‌లను కొనసాగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం ఆదివాసీల కోసం రిజర్వేషన్‌లను తీసుకొస్తే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే స్వార్థ రాజకీయాల కోసం ఆదివాసీలకు ఇవ్వకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఆదివాసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా రిజర్వేషన్లను తొంగలో తొక్కుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఆదివాసులకు ఆత్మగౌరవం లభించడం లేదన్నారు. జైనథ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీల బాధ్యతలను చైర్మన్‌లకు అప్పగించడం జరిగిందని, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు జైనథ్ మండలానికి చెందిన వ్యక్తికి అప్పగించారని పేర్కొన్నారు. కుమ్ర జంగు పటేల్, కుమ్ర గులాబ్, హర్క శేషారావు తదితరులు పాల్గొన్నారు.

'మానసిక ఒత్తిడిని జయించాలి'

తలమడుగు: ఆత్మవిశ్వాసం అనే ఆయుధంతో మానసిక ఒత్తిడిని చేయించవచ్చని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్ జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన పాటించడం అలవర్చుకోవాలన్నారు. ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేసుకోవడం ద్వారా, ఆయా అంశాలలో వెనుకబడకుండా మేము చేయగలము అనే ఆత్మవిశ్వాసం ఉంటే మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

'సింహగర్జన విజయవంతం చేయండి'

తలమడుగు: డిసెంబర్ 1న హైదరాబాదులోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ పేరిట జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నిర్వహించే సభను పెద్ద ఎత్తున మాలలు పాల్గొనాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మాలలను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు.

సీఆర్టీలుగా ఆదివాసీలనే నియమించాలి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలనే సీఆర్టీలుగా నియమించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీ వసంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు మాట్లాడుతూ.. గత సంవత్సరం ఐటీడీఏ అధికారులు సీఆర్టీ ఉద్యోగం కోసం పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. పరీక్షలకు సంబంధించిన మెరిట్‌లిస్ట్‌లో ఉన్న వారికి ప్రస్తుతం కొందరికే సీఆర్టీ ఉద్యోగం ఇస్తున్నారని అందులో లంబాడా వారికి ఇస్తున్నారని మండిపడ్డారు. నాయకులు ఓమేశ్, ఇస్రు, శేషరావు, మారుతి ఉన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు



మాట్లాడుతున్న నాయకులు

కెరమెరి: మండలంలోని మోడి గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చౌహాన్ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కనక వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులుగా సుందరి, కమల, సంతోష్, కర్ను, ధర్మారావు, కార్యదర్శులుగా గంగాసాగర్, భగవంత్‌రావు, మన్మధరావు, గణేశ్, లక్ష్మణ్‌రావు, కౌన్సిలర్లు సీహెచ్ శ్యాంరావు, అర్జున్, ఎడిట్ కమిటీ కన్వీనర్‌గా నైతం నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు తెలిపారు.